విద్య, ఇరిగేషన్‌కే మొదటి ప్రాధాన్యత

- తెలంగాణకు నోయిడాగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతా
- ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి
- మూడు రోజుల్లో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్
- అభివృద్ధికి సహకరించిన వాళ్లనే సర్పంచ్‌గా ఎన్నుకోండి
- లగచర్ల పారిశ్రామిక వాడకు అంతర్జాతీయ గుర్తింపు
- కొడంగల్ పర్యటనలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఆడబిడ్డలు సంతోషంగా, ప్రశాంతంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది. ఆవిశ్వాసంతోనే ఆడబిడ్డలను ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. వారి జీవితంలో వెలుగు నింపడానికి ప్రధానంగా విద్య, ఇరిగేషన్ రంగాలకు మేం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. అందుకు కొడంగల్‌ను ప్రయోగశాలగా ఎంచుకున్నాం. దేశానికి నోయిడా ఎలానో తెలంగాణకు కొడంగల్‌ను అలా తీర్చిదిద్దుతా. ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్‌ను మార్చేందుకు కృషి చేస్తా. రాష్ట్రం నాలుమూలల నుంచి వచ్చి చదువుకునే విధంగా నియోజకవర్గాన్ని మారుస్తా' అని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరితో కలిసి సిఎం పర్యటించారు. కొడంగల్ నియోజకవర్గంలో రూ.103 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు, ఈ సందర్భంగా రూ.5.83 కోట్లతో 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, రూ. 5.01 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ. 3 కోట్లతో 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, రూ. 3.65 కోట్లతో బంజారా భవన్ కోసం అదనపు సౌకర్యాలు (కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణ), రూ.కోటితో కొడంగల్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు శంకుస్థాపన, రూ. 1.30 కోట్లతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం.రూ. 1.40 కోట్లతో కొడంగల్‌లో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, రూ. 4.91 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, రూ. 4.45 కోట్లతో సీసీరోడ్లు, భూగర్భ డ్రయినేజీల నిర్మాణం, రూ. 2.95 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభం, రూ.60 కోట్లతో కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణ, రూ. 5 కోట్లతో గెస్ట్ హౌస్ నిర్మాణం, రూ. 4.50 కోట్లతో కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో కొత్త అభివృద్ధి పనులు చేపట్టేందుకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్న హరే కృష్ణ ఫౌండేషన్ కిచెన్ షెడ్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం ప్రసంగించారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కోటి మంది ఆడపడుచులకు చీరలు అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఆడబిడ్డకు చీర అందాలన్నారు. మహిళలు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకోవడం, ఆర్టీసీలో అద్దె బస్సులు నడిపించే విధంగా వెయ్యి మంది మహిళలను ప్రోత్సహించామన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని పారిశ్రామిక, విద్యా రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఆకలితో కడుపు మాడ్చుకోవద్దనే ఉద్దేశంతో అక్షయపాత్ర వాళ్లతో మాట్లాడి నియోజకవర్గంలో దాదాపు 312 పాఠశాలల్లో 28 వేలమంది విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు 'అమ్మవలె' ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కొడంగల్‌కు మెడికల్ కళాశాల, వెటర్నరీ కళాశాల, పారామెడికల్ కళాశాల, ఫిజియోథెరపీ, ఇంజనీరింగ్ కళాశాల, ఐటీఐ, జూనియర్, డిగ్రీ, సైనిక్ స్కూల్‌నుతీసుకొచ్చామన్నారు. కొడంగల్- నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించినట్టు తెలిపారు. రేపటి మంత్రివర్గంలో ఆమోదం పొందగానే మూడు నెలల కాలంలో పనులు ముమ్మరంగా కొనసాగుతాయన్నారు. లగచర్లకు అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు తీసుకువచ్చి లగచర్ల పారిశ్రామిక వాడను ప్రారంభించుకుంటామన్నారు. పరిశ్రమలు వేగంగా అభివృద్ధి జరగాలంటే రైలు రావాలని, వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ తీసుకువచ్చి తొందర్లోనే కొడంగల్‌లో రైల్వే కూత వినిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మూడు రోజుల్లో సర్పంచ్ ఎన్నిలకు నోటిఫికేషన్

త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందని సమాచారం ఉందని సీఎం అన్నారు. గ్రామాల్లో బడి, గుడి, తాగడానికి మంచినీరు, ఇందిరమ్మ ఇండ్లు కావాలని, ఇలాంటి పనులు చేస్తూ అభివృద్ధి చేసే వారిని సర్పంచులుగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి నిరోధకులను ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సర్పంచులు కీలకమని, రోడ్లు, బడులు, సంక్షేమ పథకాలు అందాలన్న సర్పంచులు కీలకమన్నారు. 2034 వరకు కొడంగల్ నియోజకవర్గాన్ని పర్యటక కేంద్రంగా మార్చుకుందామని తెలిపారు.

లబ్దిదారులకు చెక్కుల పంపిణీ

మైనార్టీ శాఖ ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని 625 లబ్దిదారులకు పౌల్ట్రీ, గొర్రెల ఫామ్ ఏర్పాటు నిమిత్తం ఆర్థిక సాయం చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మద్దూరు మండల మహిళా సమాఖ్య సౌజన్యంతో నడపనున్న ఆర్‌టిసి బస్సును ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.300 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును సిఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి రామ్మోహన్‌రెడ్డి, బి మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్లు రాజేశ్వర్‌రెడ్డి, విజయకుమార్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ సత్యగౌడ, చంద్రప్రభుదాస్, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి.

'అంగన్‌వాడీ' రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

- ఆదిలాబాద్‌లో నేడు భారీ బహిరంగ సభ, ర్యాలీ
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్‌లో 25, 26 తేదీల్లో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు చేపట్టబోయే పోరాటాలకు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర మహాసభకు సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ఎఆర్.సింధు, జాతీయ ఉపాధ్యక్షులు వరలక్ష్మి, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, టిఎజిఎస్ ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ హాజరు కానున్నట్టు తెలిపారు. మొదటి రోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుంచి ఉదయం 11 గంటలకు భారీ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అంబేద్కర్ చౌక్ మీదుగా నేతాజీ చౌక్, న్యూ బస్టాండ్, తెలంగాణ చౌక్ మీదుగా బహిరంగ సభ నిర్వహించే ఆర్‌అండ్‌బి అతిథి గృహ మైదానానికి చేరుకుంటుందని వివరించారు. 26న బుధవారం మావల మండలంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో ప్రతినిధుల సభ ఉంటుందని, 500 మంది పాల్గొంటారని చెప్పారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపునివ్వాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) పిలుపు మేరకు టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ, అన్ని జిల్లాల కమిటీలు నవంబర్ 25 న ప్రధాన మంత్రికి వినతిపత్రాలు ఇ మెయిల్/ పోస్ట్ ద్వారా పంపనున్నారు. ఈ నెలాఖరులోగా రాష్ట్రంలోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిసి వినతిపత్రాలు అందజేస్తారని సోమవారం టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా దానిపై సమీక్ష కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదనీ, సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పిస్తామనే భరోసా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సిటిఇ నోటిఫికేషన్ ప్రకారమే 2010 ఆగస్టు 23కు ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ పేర్కొందని గుర్తుచేశారు.

IN THE COURT OF PRL CIVIL JUDGE (SENIOR DIVISION): BAPATLA
S.O.P.NO.88/2025

Between:
Potti Lakshmi ...Petitioner
Vs
1. The Branch Manager, L.I.C Of India, Bapatla.
2. Cheedella Srinivasa Rao
3. Kunisetty Venkata Sai Prasad
... Resondents

పై నెంబర్ పిటిషనులో పిటిషనరు వారసత్వ సర్టిఫికేట్ నిమిత్తం పిటిషన్ దాఖాలు వేసియున్నారు. అట్టి వారసత్వ సర్టిఫికేట్ పిటిషనరు అయిన పొట్టి లక్ష్మి గారికి, ధృవీకరించుటకు ఎవరికైననూ అభ్యంతరం ఉన్నచో ది.16-12-2025 వ తేదిన మీరు గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ బాపట్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు వారి ఎదుట ఉ॥ గం॥ 10:30 ని॥లకు హాజరై తమ ఆక్షేపణలను తెలియజేయగలరు లేనిచో శ్రీ కోర్టువార్టు తమ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా తేదీ :16-12-2025

ఇట్లు
పులిపాక రఘురాం,
ఊసా కృష్ణయ్య,
ఇమ్మడిశెట్టి యల్లమందరావు,
శీలం సాయి కిరణ్,
న్యాయవాదులు, బాపట్ల.

డ్వాక్రా సంఘాలకు రూ.304 కోట్ల వడ్డీలేని రుణాలు

- రాష్ట్ర వ్యాప్తంగా నేడు పంపిణీ
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలోని 3.50 లక్షల మంది స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జి) మహిళలకు రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలను మంగళవారం ఒకేసారి పంపిణీ చేయనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఒకేసారి ఘనంగా నిర్వహించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు ముందస్తుగా సమాచారం అందించి సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో జరిగే వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి మండల సమాఖ్యతోపాటు గ్రామ సమాఖ్యలో ముఖ్యులందరూ హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని వదిలేసిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళల్లో ఒక నమ్మకం, ధైర్యం వచ్చిందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెండు మూడు దఫాలుగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని అన్నారు. మంగళవారం మరోసారి పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు పంచబోతున్నామని వివరించారు. రాష్ట్రంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్లు అద్భుతంగా నిర్వహించారని అన్నారు. ప్రతి మండలం నుంచి సమాచారం అందిందని చెప్పారు. నాణ్యతతో కూడిన మంచి డిజైన్లు కలిగిన చీరలను పంపిణీ చేశారంటూ మహిళా మణులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. ప్రతి గ్రామానికి ఇందిరమ్మ చీరలు చేరవేయడంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేసినందుకు కలెక్టర్లను ఆయన అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క, సిఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలు జమ చేయడం పట్ల పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సింది. రాష్ట్రంలోని 3,57,098 సంఘాలకు ఈ నిధులు చేరాయని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వివరించారు. ఏటా రూ.25 వేల కోట్లకు తగ్గకుండా మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తుందని తెలిపారు. వాటికి వడ్డీ భారం లేకుండా ప్రభుత్వం తరఫునే వడ్డీలను చెల్లించడం కొనసాగుతోందని పేర్కొన్నారు. తాజాగా రూ.304 కోట్ల వడ్డీలు చెల్లించామని తెలిపారు. దీంతో ఇప్పటివరకు గ్రామీణ సంఘాలకు రూ.1,118 కోట్ల వడ్డీ రహిత రుణాలు చేరాయని వివరించారు. ఇవి కాకుండా పట్టణ మహిళా సంఘాలకు సుమారు రూ.300 కోట్ల వడ్డీ లేని రుణాలను చెల్లించామని తెలిపారు.

స్లిమ్మింగ్ క్లినిక్‌లో ఇషా రెబ్బా సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్

గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన లగ్జరీ కృత్రిమ మేధ పవర్డ్ స్లిమ్మింగ్ క్లినిక్ 'మైనస్'ను కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిఎండి డాక్టర్ బి భాస్కరరావు, కిమ్స్ సన్‌షైన్ ఎండి డాక్టర్ ఎవి గురవారెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఈ క్లినిక్ ప్రారంభోత్సవానికి సినీ నటి ఈషా రెబ్బా విచ్చేయగా.. ఈ ప్రాంతం సందడిగా మారింది. క్లినిక్ అంతా కలియదిరిగారు. అనంతరం బయటకు వచ్చి అభిమానులకు అభివాదం చేశారు. అధిక బరువు ఈ తరం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన ఆరోగ్య సమస్యలలో ఒకటని డాక్టర్ బి భాస్కరరావు పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని దెబ్బతీయకుండా సహజమైన, శాస్త్రీయ విధానాలతో బరువు తగ్గే అవకాశాన్ని స్లిమ్మింగ్ క్లినిక్ కల్పిస్తుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఆ సంస్థ ఫౌండర్ శరవన్ వెల్ జె, ఫ్రాంఛైజీ ఓనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఅండ్‌జి నుంచి లివోజెన్ ఐరన్ గుమ్మీస్

ముంబయి : మహిళలు రోజూ అవసరమయ్యే ఐరన్‌ను పూరించేందుకు సహాయపడటమే లక్ష్యంగా లివోజెన్ ఐరన్ గమ్మీస్‌ను ఆవిష్కరించినట్లు ప్రాక్టర్ అండ్ గాంబిల్ (పిఅండ్‌జి) హెల్త్ లిమిటెడ్ తెలిపింది. ఈ నూతన ఉత్పత్తి, శరీరానికి అవసరమైన ఐరన్‌ను రుచికరమైన స్ట్రాబెర్రీ ఫ్లేవర్ గమ్మీస్ రూపంలో అందిస్తుందని ఆ సంస్థ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. రోజుకు రెండు గమ్మీస్ తీసుకుంటే అది రెండు గిన్నెల పాలకూరలో ఉండే ఐరన్‌కు సమానమన్నారు. 30 గుమ్మీస్ ప్యాక్ ధరను రూ.599గా నిర్ణయించింది.

కేశ్ కింగ్ రీబ్రాండింగ్

హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఇమామి లిమిటెడ్‌కు చెందిన హెయిర్ కేర్ బ్రాండ్ కేశ్ కింగ్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా కేశ్ కింగ్ గోల్డ్‌గా మారినట్లు పేర్కొంది. దీనివలన బ్రాండ్‌కు ఒక కొత్త గుర్తింపు లభించనుందని ఇమామి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రీతి ఎ సురేఖ పేర్కొన్నారు. ప్రామాణికత, పని తీరు, శాస్త్రీయ ధృవీకరణ డిమాండ్‌లను ఇది తీరుస్తుందన్నారు. దీనికి నటీ శిల్పాశెట్టి బ్రాండ్ అంబాసీడర్‌గా కొనసాగుతారని పేర్కొన్నారు.

50 మంది కళాకారులకు హెచ్‌ఎంఐఎఫ్ గ్రాంట్

హైదరాబాద్ : కళ ద్వారా సామాజిక మార్పులకు మద్దతును అందించే 50 మంది కళాకారులకు రూ.60 లక్షల గ్రాంట్‌ను అందించినట్లు హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) తెలిపింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా ఆర్థిక మద్దతును కల్పించినట్లు పేర్కొంది. 'ఆర్ట్ ఫర్ హోప్-సీజన్5'లో దేశంలోని 30 ప్రాంతాల నుంచి దరఖాస్తులు రాగా.. 22 ప్రాంతాలకు చెందిన కళాకారులను ఎంపిక చేసినట్లు పేర్కొంది. 40 మంది వ్యక్తిగత కళాకారులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున, 10 బృందాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ. 60 లక్షల గ్రాంట్ అందించినట్లు ఆ సంస్థ తెలిపింది.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
IA No: 235/2022
IN
IA No:14/2018
IN
IP No :5/2015

Between:
జంగా ప్రకాశరావు
...పిటీషనర్ /పిటిషనర్/ పిటిషనర్
మరియు
పప్పొప్పుల రత్తమ్మ వగైరాలు
... రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్ /రెస్పాండెంట్స్
To
R-10 పప్పొప్పుల భవాని W/o లేటు సత్యనారాయణ మూర్తి ,E-4, ఆర్క్ మెజిస్టిక్, గ్రీన్ వుడ్ రెసిడెన్సి, కౌకూర్, సికింద్రాబాద్-500010.
R-11 పప్పొప్పుల వీరేంద్ర S/o లేటు సత్యనారాయణ మూర్తి -do - -do- -do-
R-12 పప్పొప్పుల సూర్య S/o లేటు సత్యనారాయణ మూర్తి -do - -do- -do-

ఈ నెంబరు పిటిషనులో 5వ రెస్పాండెంటు లేటు సత్యనారాయణమూర్తి గారికి వారసులుగా మిమ్ములను చేర్చుటకు పిటీషను దాఖలు చేయగా మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ యొక్క పిటిషను ది 02- 12-2025 వ తారీకు నాటికి మీ హాజరు కొరకు వాయిదా వేసినారు. కావున ది . **02-12-2025** వ తేదీ ఉదయం గం **10:30** ని!!ల లగాయితు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల సదరు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల రీత్యా తెలియ చేయడమైనది.

N S N Murthy,
పిటీషనర్ తరపు న్యాయవాది
అమలాపురం
Cell:9441767978.

అమలాపురం
21-11-2025.

జినోమ్ వ్యాలీలో థర్మో ఫిషర్ సైంటిఫిక్ రెండో సెంటర్

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

అంతర్జాతీయంగా సైన్స్ రంగంలో అగ్రగామి సంస్థ థర్మో ఫిషర్ సైంటిఫిక్ హైదరాబాద్‌లోని జినోమ్ వేలీలో రెండు కొత్త సెంటర్స్‌ను ఆవిష్కరించింది. తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చింది. బయోటెక్ పార్క్ ప్రాజెక్ట్ కింద కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఇతర భాగస్వాములుగా ఉన్నాయి. దీనిని సోమవారం తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. బయోప్రాసెసింగ్, అనలిటికల్ సైన్సెస్, హెల్త్‌కేర్, క్లీన్ ఎనర్జీ, సెమీకండక్టర్స్‌లాంటి విభాగాల్లో ఆవిష్కరణలను వేగవంతం చేసే విధంగా ఈ సెంటర్లు ఏటా 200 నుంచి 250 మంది వరకు పరిశోధకులు, శాస్త్రవేత్తలకు అవసరమైన అధునాతన టెక్నాలజీలు, శిక్షణ, భాగస్వామ్య కార్యక్రమాల రూపంలో తోడ్పాటు అందిస్తాయని ఆ కంపెనీ తెలిపింది. "తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం పటిష్టమైన వద్ధి బాటలో ముందుకెళ్తోంది. 2030 నాటికి లైఫ్ సైన్సెస్‌లో రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులు సాధించాలన్న మా లక్ష్య సాకారానికి ఇలాంటి భాగస్వామ్యాలు తోడ్పడతాయి. గ్లోబల్ సామర్థ్యాలతో ఈ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు థర్మో ఫిషర్ కొత్త సెంటర్లు ఉపయోగపడతాయి. తెలంగాణను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలపాలన్న మా విజన్‌కి తోడ్పడుతూ మరోవైపు భాగస్వామ్య మరియు నైపుణ్యాల శిక్షణ అవకాశాలను కల్పించేందుకు ఈ కొత్త కేంద్రాలు ఉపయోగపడతాయి" అని మంత్రి డి శ్రీధర్ బాబు తెలిపారు.

లేబర్ కోడ్ ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లతో మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు తీవ్ర అన్యాయం

- కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లేబర్ కోడ్‌లతో మెడికల్ రిప్రజెంటేటీవ్స్‌కు తీవ్ర అన్యాయం జరగబోతున్నదని తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ (టిఎంఎస్‌ఆర్‌యు) ప్రధాన కార్యదర్శి సిహెచ్ భానుకిరణ్, అధ్యక్షులు పి రాజుభట్, జాయింట్ జనరల్ సెక్రటరీ ఎ నాగేశ్వరరావు, ఎపిఎంఎస్‌ఆర్‌యు ప్రధాన కార్యదర్శి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి ఎస్‌పిఇ యాక్టు -1976ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కారు తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సోమవారం హైదరాబాద్ విద్యానగర్‌లో కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనరేట్ ఎదుట టిఎంఎస్‌ఆర్‌యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్‌ల ప్రతులను దగ్ధం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ... ఇప్పటికే సేల్స్‌పేరుతో మెడికల్ రిప్రజెంటేటీవ్‌లపై యాజమాన్యాల వేధింపులున్నాయనీ, కొత్త కోడ్‌లతో అవి మరింత తీవ్రరూపం దాల్చుతాయని వాపోయారు. సేల్స్ ప్రమోషన్ ఇండస్ట్రీగా గుర్తించాలని కోరారు. కొత్తకోడ్‌లలో మెడికల్, సేల్స్ రిప్రజెంటేటీవ్స్‌కు సంబంధించి అపాయింట్‌మెంట్, సెలవులు, కనీస మౌలిక వసతుల కల్పన వంటివేవి కొత్త కోడ్‌లలో లేవని ఎత్తిచూపారు. ఇక నుంచి చట్టబద్ధమైన పనిదినాలు, పనిగంటలు ఉండవని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎమ్ఎస్‌ఆర్‌యూ రాష్ట్ర నాయకులు ఏఎన్.చారి, జగదీశ్‌చారి, అప్రోజ్, సతీశ్, రాజ్‌కుమార్, కిశోర్, పాల్గొన్నారు.

టెట్‌కు 1,26,085 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కోసం సోమవారం సాయంత్రం వరకు 1,26,085 దరఖాస్తులొచ్చాయి. ఇందులో టెట్ పేపర్ 1 పరీక్ష కోసం 46,954 దరఖాస్తులు రాగా, పేపర్ 2 కోసం 79,131 దరఖాస్తులొచ్చాయి. టెట్ అర్హత లేని ఉపాధ్యాయులకు దానిని తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ సారి టెట్‌కు దరఖాస్తు చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఈ నెల 29తో అప్లికేషన్ల స్వీకరణకు గడువు ముగియనుండగా, టెట్ ఎడిట్ ఆప్షన్స్ గడువు డిసెంబర్ 1 వరకు ఉన్నది.

శిశువు గాయపడ్డ ఘటనలో తల్లికి రూ.50 వేలు ఇవ్వండి

- సిఎస్‌ను ఆదేశించిన టిజిహెచ్‌ఆర్‌సి

హైదరాబాద్ బ్యూరో : ప్రభుత్వాస్పత్రిలో ఫ్యాన్ పైనుంచి పడి శిశువు గాయపడ్డ ఘటన కేసులో బాధిత చిన్నారి తల్లికి రూ.50 వేల పరిహారాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) చైర్మన్ షమీమ్ అక్తర్ సోమవారం ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ పీహెచ్‌సీలో అప్పుడే పుట్టిన శిశువు తిరుగుతున్న ఫ్యాన్ పైనుంచి ఊడి పడిన ఘటనను మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. విచారణ నివేదిక పరిశీలించిన పిదప 07.11.2025 తేదీ ఉత్తర్వు ద్వారా, ఈ ఘటన ప్రభుత్వ ఆరోగ్య సంస్థల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని కమిషన్ ఎత్తిచూపింది. రోగుల భద్రతనుకాపాడాల్సినరాష్ట్రపుబాధ్యతలసూచిస్తుందని నిర్ధారించింది.

IN THE COURT OF THE HON'BLE IX JUDICIAL MAGISTRATE OF FIRST CLASS
AT: HYDERABAD
ORDER OF ATTACHMENT TO COMPEL TH APPEARANCE OF A PERSON ACCUSED (Under Section 82 Cr. P.C.)
CC NI. NO 4964 OF 2022

BETWEEN:
M/s KOP Agro Tch Ltd ....Complainant
AND
M/s SS Sri Foods & Others ...Accused

To,
SS Sri Foods & Others, Rep by Satyakala R/o 11-164/F Plot N 201, Varsha Avenue, Patwari Enclave IDPL Colony, Hyderabad, Telangana-500054 Also at: S.S. Sri Foods, Plot No. 115, IDA Gandhi Nagar, Hyderabad, Telangana-500037

Where as complainants has been duly made a complainant requiring, Satyakala of SS Sri Foods W/o is suspected to have committed the offence punishable U/Sec 138 of NI Act and it has been returned to submit warrant of arrest there upon issued then the said Accused cannot be found and whereas it has been shown to my satisfaction that the said Accused Satyakala is concealing himself to avoid the service of the said warrant. Proclamation is hereby made that the said **Satyakala** Requiring to appear before this court on 6th day of January 2026 **6-1-2026** To answer the said complaint.

IX Judicial Magistrate of First Class

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- ములుగులో సిఐటియు భారీ ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ జి.మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు ముందు ములుగులో డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలైన ఐకెపి, పిఎసిఎస్, జిసిసిల్లో పనిచేస్తున్న బజార్ ముఠా హమాలీ, సివిల్ సప్లయ్ హమాలీ.. తదితర హమాలీ కార్మికులందరికీ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గిగ్ వర్కర్ల తరహా హమాలీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు లారీలు లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బస్తాలు మీద పడి గాయాలపాలైనా, మృతిచెందినా ఎలాంటి రక్షణ లేదని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లోడ్ చేసినంత టైం తాడు కొట్టేందుకు సరిపోతుందని దానికి మామూళ్లు ఇప్పించాలని కోరారు. హమాలీలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు... రఘు, చిన్ని, స్వామి, సారయ్య, బాలరాజు, రాములు, శ్రీధర్, లక్ష్మణ్, రమేష్, అనిల్, శేఖర్, నక్క సదయ్య, అల్లం కుమార్, నక్క ఐలయ్య, సుధాకర్, లింగయ్య, మొగిలి, పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా కె బ్రహ్మచారి, ఎజె రమేష్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా కె.బ్రహ్మచారి, ఏజే.రమేష్ ఎన్నికయ్యారు. ఈ నెల 23, 24 తేదీల్లో మణుగూరులోని కామ్రేడ్ కూకట్ల శంకర్ నగర్, కామ్రేడ్ ఎర్ర శ్రీకాంత్ ప్రాంగణంలో 4వ జిల్లా మహాసభలు ఘనంగా జరిగాయి. మహాసభ రెండో రోజు సోమవారం 45 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షులుగా కె.బ్రహ్మచారి, కార్యదర్శిగా ఏజే.రమేష్, ఉపాధ్యక్షులుగా జీలకర్ర పద్మ, పిట్టల అర్జున్, గద్దల శ్రీనివాస్ రావు, ఎస్ఎ నబీ, దొడ్డ రవికుమార్, బి వెంకట రాజు, ఈసా వెంకటమ్మ, సహాయ కార్యదర్శిగా కె.సత్య, జి.ధనలక్ష్మి, భూక్య రమేష్, విజయగిరి శ్రీనివాస్, వజ్జా సుశీల, బండారు శరత్, రాజేష్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. వాటిని వెనక్కి తీసుకునే వరకూ అలుపెరుగని పోరాటం నిర్వహిస్తామన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు కృతజ్ఞతలు

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తన గెలుపుకు సహకరించిన టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ప్రొఫెసర్ కోదండరాంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కోదండరాం నవీన్ యాదవ్‌ను శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. నగర రాజకీయాల్లో అంజయ్య, వెంకటస్వామి, పిజెఆర్ వంటి నేతల నైతికతను, ప్రజాసేవను ఆదర్శంగా తీసుకుని ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేయాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

- చందూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘటన
- ఆత్మహత్యపై పలు అనుమానాలు
- ప్రిన్సిపల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాల ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీ గురుకులంలో పదో తరగతి విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలోని పాఠశాలలో ఆదివారం రాత్రి జరిగింది. విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన షేక్ మూసా (16) అనే విద్యార్థి చందూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అయితే ఆదివారం రాత్రి హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వార్డెన్ పోలీసులకు సమాచారం అందించాడు. దాంతో ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, వర్ని, రుద్రూర్ ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం..?

ఇంటి నుంచి ఆదివారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థి రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమేనని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్, సిబ్బంది చెప్పే వివరాలు పొంతన లేవని, పైగా పాఠశాలలో తొమ్మిది సిసి కెమెరాలు పని చేయడం లేదని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విద్యార్థి మృతికి కారణమైన ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని విధుల నుంచి తొలగించాలన్నారు. గురుకులాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

పత్తి దిగుమతులపై పన్ను ఎత్తేసిన మోడీ

- 26న రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు : టి.సాగర్
- కపాస్ కిసాన్ యాప్‌ను వెనక్కి తీసుకోవాలి : భూక్య చందు నాయక్

ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో పత్తి రైతులకు ఈ దుస్థితి రావడానికి ఆగస్టు నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పత్తి విదేశీ దిగుమతులపై 11 శాతం పన్ను ఎత్తేయడమేనని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, పత్తి రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్య చందునాయక్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల నుంచి రైతు సంఘం నాయకులు, రైతులు కలిసి మహబూబ్‌నగర్‌లోని సిసిఐ రీజినల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్, చందునాయక్ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం తగ్గించడం వల్ల.. అమెరికా దేశం నుంచి పత్తి బేళ్లు దిగుమతి అవుతున్నాయని, దీంతో ఇక్కడి రైతుల పంటలపై అనేక ఆంక్షలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన పత్తికి డిమాండ్ తగ్గి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు నానా అవస్థలు పడుతున్నారని, పంటను అమ్ముకోవడానికి కొర్రీలు పెట్టడంతోపాటు కపాస్ కిసాన్ యాప్ తెచ్చారన్నారు. ఎకరానికి ఏడు క్వింటాళ్లే కొంటామనే నిబంధన ఎత్తేయాలని, గతంలో ఉన్న విధంగా12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తేమతో నిమిత్తం లేకుండా సిసిఐ ద్వారా రైతుల పత్తి పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు. రైతులు పండించిన పత్తి పంటను ఎక్కడైనా స్వేచ్ఛగా విక్రయించే అవకాశం కల్పించాలన్నారు. కపాస్ యాప్ వల్ల కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాప్ అమలును వెనక్కి తీసుకోవాలన్నారు. మ్యాపింగ్ పేరుతో కాటన్ మిల్లుల దగ్గరలో ఉన్న గ్రామాల రైతులను సుదూర ప్రాంతాలకు పంపడం వల్ల రవాణా చార్జీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాపింగ్ పద్ధతిని వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య అశోక్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, గద్వాల జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు ఎ రాములు, పత్తి రైతులు పాల్గొన్నారు.

పాలనలో పెద్ద ఎత్తున అవినీతి

- సిఎం దృష్టి పెట్టి అవినీతిపరులకు శిక్షపడేలా చూడాలి
- సిఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎం.పద్మనాభరెడ్డి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుండటంతో సామాన్యులు ఇబ్బంది పాలవుతున్నారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎం.పద్మనాభరెడ్డి ఎత్తిచూపారు. ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అవినీతి కేసుల్లో పట్టుబడ్డ ఉద్యోగులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. 'తెలంగాణ అవినీతి నిరోధక శాఖ పెద్ద ఎత్తున అవినీతి అధికారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నది. రోజుకు ఒకటి చొప్పున, కొన్ని సందర్భాలలో ఒక్కో రోజు ఇద్దరుముగ్గురు అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఘటనలున్నాయి. అవినీతి నిరోధక శాఖ పనితీరులో పాలనలో అవినీతి తగ్గుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. కానీ, అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళినా డబ్బులు ఇవ్వందే పనికావడం లేదు. ఐదేండ్లలో నమోదైన అవినిరోధక శాఖ కేసుల్లో ఎంత మంది అవినీతి అధికారులు శిక్షలు పడ్డాయని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విశ్లేషించగా అనేక ఆశ్చర్యకర విషయాలు బయటపడ్డాయి. ఐదేండ్లలో 621 అధికారులపై కేసులు నమోదయ్యాయి. అందులో 519 కేసుల్లో అవినీతి నిరోధక శాఖ విచారణ పూర్తయింది. ప్రాసిక్యూషన్ అనుమతి కోసం ప్రభుత్వానికి లేఖలు పంపింది. ప్రభుత్వ అనుమతి లేనిదే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయలేరు. దాఖలు చేసిన తర్వాత కూడా కేసు కొలిక్కి వచ్చేందుకు మూడు నుంచి ఐదేండ్లు పట్టొచ్చు. అంటే ఒక అవినీతి అధికారిపై కేసు నమోదైనా తుది తీర్పు రావడానికి పదేండ్లు పడుతున్నది. కొన్ని సందర్భాల్లో అది 15 ఏండ్లకు కూడా చేరుతున్నది. అంతలో సదరు అధికారి రిటైర్డ్ అయిపోతున్నారు. ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డికి, సిఎస్‌కు పలు ఉత్తరాలు ఇప్పటికే రాశాం. అయినా పరిస్థితిలో మార్పులేదు. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతినిరోధక శాఖను పెద్దగా పట్టించుకోవడం లేదు. రాష్ట్ర సచివాలయంలో పైరవీలు చేసి తప్పించుకోవచ్చు అన్న భావన ఉంది. సచివాలయంలో ఉన్నతాధికారులు అవినీతి నిరోధక శాఖ రిపోర్టులపై పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో సెక్షన్ ఆఫీసర్లు అవినీతి అధికారులకు కొమ్ము కాస్తున్నారు. దీంతో ఏమీ కాదులే అన్న భావంతో అవినీతి పెచ్చుమీరిపోతున్నది. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కూడా అపవాదును మూటకట్టుకుంటున్నది. ఇప్పటికైనా అవినీతి అధికారులపై నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని లేఖలో ప్రస్తావించారు.

హైదరాబాద్‌లో నారాయణ గ్రూప్ 'ది వన్ స్కూల్' ప్రారంభం

- 21వ శతాబ్ద విద్యకు కొత్త దశ, దిశ చూపేందుకు నారాయణ నూతన ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసియాలోనే అతిపెద్ద విద్యాసంస్థల్లో ఒకటైన నారాయణ గ్రూప్, తమ అత్యంత ప్రతిష్టాత్మకమైన మరో నూతన విద్యాసంస్థ 'ది వన్ స్కూల్' ప్రారంభాన్ని హైదరాబాద్‌లో ఘనంగా ప్రకటించింది. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ స్కూల్ ఆధునిక, సమగ్ర విద్యా విధానాలతో విద్యార్థులను ప్రపంచ స్థాయి నాయకులుగా మార్చబోతోంది. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో వారిని భావి విజేతలుగా మలిచేందుకు అన్ని రకాల అస్త్రశస్త్రాలను సిద్ధం చేసింది. నారాయణ ది వన్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించడం మాత్రమే చాలదని అభిప్రాయపడ్డారు. అంతకుమించి విమర్శనాత్మక ఆలోచన, వ్యక్తిత్వ వికాసం, సామాజిక జీవన నైపుణ్యాలు అవసరమని తెలిపారు. ఆ అవసరాలను తీర్చడమే లక్ష్యం 'ది వన్ స్కూల్'ని రూపొందించామని చెప్పారు. ఈ స్కూల్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా ప్రమాణాలను అందించనున్నట్టు వెల్లడించారు.

లేబర్ కోడ్‌లు కార్మికుల జీవన్మరణ సమస్య

- వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల రద్దు అప్రజాస్వామ్యం
- టిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు జర్నలిస్టుల ధర్నా

ధర్నా చేస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు జర్నలిస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు కార్మికులు, జర్నలిస్టులు పోరాటం చేయాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ శివం రోడ్‌లోని కేంద్ర కార్మికశాఖ కార్యాలయం ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) ఆధ్వర్యంలో కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా జర్నలిస్టులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ధర్నాకు ఫెడరేషన్ అడహాక్ కమిటీ కన్వీనర్ పి రాంచందర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్మికులను గాలికొదిలేసి కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం వ్యవరిస్తున్నదన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమన్నారు. లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవ పున్నయ్య మాట్లాడుతూ.. రెండు వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేయడాన్ని ఖండించారు. జర్నలిస్టులకు లేబర్ కోడ్‌లు విఘాతంగా మారాయన్నారు. ఫెడరేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ, లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్ ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమిస్తామన్నారు. అనంతరం సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ పృష్టికి ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

కోడ్‌లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి : జె.వెంకటేష్

ధర్నాకు హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలు స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఉన్నాయని గుర్తు చేశారు. కొత్త లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రభాకర్, గుడిగ రఘు, బట్టిపాటి రాజశేఖర్, దామోదర్, జి.మాణిక్ ప్రభు, కార్యదర్శులు ఈ.చంద్రశేఖర్, నవీన్, కార్యవర్గ సభ్యులు మణిమాల, హరిప్రసాద్, మేకల కృష్ణ, మధుకర్, హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్, హెచ్‌యూజే నాయకులు లలిత, రమాదేవి, రత్నాకర్, తలారి శ్రీనివాసరావు, జీవన్‌రెడ్డి, రమేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి సజ్జనార్ ఆకస్మిక పర్యటన

- పెట్రోలింగ్ వాహనంలోనే లంగర్ హౌజ్‌లో రౌడీ షీటర్ల ఇళ్లకు సిపి
- నేర చరిత్ర, జీవన విధానంపై ఆరా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లంగర్ హౌజ్, టోలిచౌకిల్లో ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ పెట్రోలింగ్ వాహనంలో స్వయంగా గస్తీ నిర్వహించారు. సైరన్, ఎలాంటి ఆర్భాటం లేకుండా ఆ వాహనంలోనే లంగర్‌హౌజ్ పిఎస్ పరిధిలోని ఎండి లైన్స్, ఆశాం నగర్, డిఫెన్స్ కాలనీల్లోని రౌడీ షీటర్ల ఇండ్లకు నేరుగా వెళ్లారు. రౌడీ షీటర్లను నిద్రలేపి వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు. మళ్లీ నేరాల వైపు అడుగు వేస్తే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. నేర ప్రవృత్తి వీడి సన్మార్గంలోకి రావాలని హితవు పలికారు. అలాగే సౌత్ వెస్ట్ జోన్‌లోనూ సిపి ఆకస్మిక పర్యటన చేశారు. రాత్రి 12:00 గంటల నుంచి తెల్లవారుజాము 3:00 గంటల వరకు లంగర్ హౌస్, టోలిచౌకి పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులు, కీలక ప్రాంతాలు, సున్నితమైన పాయింట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. టోలిచౌకి పరిధిలో రాత్రిపూట తెరిచి ఉన్న హోటళ్ల, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల్లోకి వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో షాపులు తెరిచి ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. పెట్రోలింగ్ సిబ్బంది ఎంత మేర అప్రమత్తంగా ఉన్నారు, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారనే అంశాలపై క్షేత్రస్థాయిలో నేరుగా ఆరా తీశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్ల, అధికారులను స్వయంగా కలుసుకుని, గస్తీ పాయింట్లు, స్పందన వేగం, సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి.. స్టేషన్ జనరల్ డైరీ, రాత్రి చేసిన ఎంట్రీలు, డ్యూటీలో ఉన్న సిబ్బంది హాజరు వివరాలు, వారికి అప్పగించిన బాధ్యతలను పరిశీలించారు. రాత్రి వేళల్లో పోలిసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలా స్పందిస్తున్నారన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తున్నట్టు సీపీ తెలిపారు. పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌లో భాగంగా చేపడుతున్న ఈ పర్యటనలు సిబ్బంది బాధ్యతా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సేవల నాణ్యతను మెరుగుపరుస్తాయని అన్నారు. విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించిన ఆయన.. నగరంలో నేరాలపై కఠినమైన పర్యవేక్షణ కొనసాగుతున్నట్టు చెప్పారు. నగర భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి సమస్యపైనా వెంటనే స్పందించే విధంగా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం

- 30న చలో హైదరాబాద్ - డిసెంబర్ 8న ఛలో ఢిల్లీ
- జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల్లో బిసిలకు తీరని అన్యాయం చేసినందుకు నిరసనగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేయనున్నట్టు బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30న చలో హైదరాబాద్, డిసెంబర్ 8న చలో ఢిల్లీ కార్యక్రమాలను నిర్వహించి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బిసిలతో చర్చించిన తర్వాతనే రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎలాంటి శాస్త్రీయత లేకుండా అధికారులు ఇష్టానుసారంగా రిజర్వేషన్లు కేటాయించారనీ, దీంతో గతంలో కన్నా ఈ సారి పంచాయతి ఎన్నికల్లో బిసిలకు ఎక్కువ అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో బిసిలకు 18 శాతం నుంచి 22 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయని, ఈ సారి 16 శాతం నుంచి 20 శాతం వరకే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక డివిజన్లలో, మండలాల్లో బిసిలకు ఒక్క సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, మండలాల వారీగా చూస్తే ఒక్కో మండలంలో గత ఎన్నికల కంటే కనీసం రెండు, మూడు గ్రామాల బిసి కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. జనరల్ కోటాను పెంచి బిసిలకు రావలసిన సర్పంచ్ స్థానాలను అగ్రకులాలకు కట్టబెట్టాలనే కుట్ర చేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా బిసి కోటాను తగ్గించిన వివరాలతో సిఎస్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని, న్యాయం జరగకుంటే కోర్టుల ద్వారా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వేధింపులు తట్టుకోలేక.. భర్తను హత్యచేసిన భార్యలు

- నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేధింపులు తట్టుకోలేక కట్టుకున్న భర్తను ఇద్దరు భార్యలు డీజిల్ పోసి నిప్పంటించి హత్య చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం దేవక్కపేటలో జరిగింది. ఎస్ఐ సందీప్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌నగర్ (దేవక్కపేట) గ్రామానికి చెందిన మాలవత్ మోహన్ (39)కు ఇద్దరు భార్యలు, ఐదుగురు కుమార్తెలున్నారు. మోహన్ మొదటి భార్య సంగీతకు ముగ్గురు, రెండో భార్య కవితకు ఇద్దరు కూతుర్లున్నారు. అయితే మోహన్ తరచూ మద్యం తాగి వచ్చి ఇద్దరు భార్యలతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం సైతం తాగి వచ్చి వారితో గొడవపడి గదిలో బంధించాడు. భర్త వేధింపులు తట్టుకోలేక భార్యలిద్దరూ విసిగిపోయారు. దాంతో పథకం ప్రకారం.. సోమవారం ఉదయం డీజిల్ కొనుక్కొని వచ్చారు. కాగా, ఇంటి ముందర కుర్చీలో మద్యం మత్తులో నిద్రిస్తున్న మోహన్‌పై డీజిల్ పోసి నిప్పంటించారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించి మోహన్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిఐ సత్యనారాయణగౌడ్, ఎస్ఐ సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని సోదరుడు మాలవత్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భర్తను హత్య చేసిన భార్యలిద్దరు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

సొసైటీ కార్యాలయం, రైతులపై కాంగ్రెస్ నాయకుల దాడి

- ఖమ్మం జిల్లా లక్ష్మీపురం సొసైటీలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్ష్మీపురం సొసైటీ కార్యాలయంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు దాడి చేసిన సంఘటన సోమవారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం (ఎల్) గ్రామంలో చోటుచేసుకుంది. ఎరువుల కోసం వచ్చిన రైతులపైనా దాడి చేయడం గమనార్హం. అలాగే సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావుపైనా దాడి చేసేందుకు ప్రయత్నించినట్టు రైతులు తెలిపారు. లక్ష్మీపురం సొసైటీ పరిధిలో తూటికుంట్ల, లక్ష్మీపురం, గోవిందాపురం (ఎల్), గార్లపాడు గ్రామాలున్నాయి. లక్ష్మీపురం సొసైటీకి విడతల వారీగా మొత్తం 1115 యూరియా కట్టలు వచ్చాయి. వాటిని పంట పొలాల ఆధారంగా సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, సిబ్బంది నాలుగు రోజులుగా పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క గ్రామానికి ఎరువులు పంపిణీ చేస్తూ వస్తున్నారు. లక్ష్మీపురం రైతులకు ఎరువులు పంపిణీ చేసిన అనంతరం గోవిందాపురం రైతులకు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. గోవిందాపురం గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నేతలు "ఇది ఏమైనా కూరగాయల బేరమా" అంటూ మాదినేని వీరభద్రరావు మీదకు వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే అక్కడే ఎరువుల కోసం వచ్చిన గోవిందాపురంకు చెందిన షేక్ జాన్ మియా ఎరువులను ప్రశాంతంగా పంపిణీ చేస్తుంటే గొడవెందుకు చేస్తున్నారంటూ వారిని ప్రశ్నించాడు. దాంతో వారందరూ జాన్ మియా దగ్గరకు వచ్చి "నీవ్వు ఎవడివి రా?" అంటూ బలంగా నెట్టటంతో కింద పడిపోయాడు. రైతులు వారిస్తున్నా వినిపించుకోలేదు. రైతులపై ఘర్షణకు దిగి, వారిపై దాడి చేసేందుకు ప్రయత్నం చేశారు. మరోవైపు మాదినేని వీరభద్రరావుపై దాడికి విఫలయత్నం చేశారు. దాంతో వారికి రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దాంతో అక్కడ నుంచి కాంగ్రెస్ నాయకులు ఉడాయించారు. అనంతరం ఎస్ఐ పొదిలి వెంకన్న తన సిబ్బందితో సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. మాదినేని వీరభద్రరావు, రైతులతో సంఘటనపై ఆరా తీశారు. కాంగ్రెస్‌కు చెందిన ఉమ్మనేని బాబు, ఉమ్మనేని రమేష్, కళ్యాణపు నాగేశ్వరరావు, సాదం కొండలరావు, ఆదూరి మనోజ్, ఉమ్మనేని రవి.. తమపై దాడి చేశారంటూ మాదినేని వీరభద్రరావు, పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బిసిలకు కాంగ్రెస్ ద్రోహం

- రాహుల్‌గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతాం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్ల అంశంతో పాటు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేస్తున్నదని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కెటిఆర్) విమర్శించారు. రాష్ట్రంలోని బిసిలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిసి ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులతో కెటిఆర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రిజర్వేషన్ల పెంపు జరగకముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్టు రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకునిగా ఉన్న ఆయన వెంటనే ఈ అంశంపైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికైన బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు లోక్‌సభలో గళం లేవనెత్తాలని కోరారు. బిసి డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బిసిలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామనీ, గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల నిధులను కేటాయించేలా కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తామని అన్నారు. బిజెపి పదేపదే బిసిల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకుని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

శామీర్‌పేట్ ఒఆర్ఆర్‌పై కారులో మంటలు

- వ్యక్తి సజీవ దహనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై విషాద ఘటన జరిగింది. కారులో మంటలు చెలరేగడంతో ఓ వ్యక్తి సజీవ దహనమయ్యారు. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జైగిరి గ్రామానికి చెందిన తల్లపల్లి దుర్గాప్రసాద్ (30) ఈ 69 డిజిటల్ న్యూస్ ఛానల్ పార్ట్‌నర్ ఉన్నారు. ఆదివారం వృత్తి పని మీద హైదరాబాద్‌కు వచ్చిన ఆయన రాత్రి మియాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉండి సోమవారం తెల్లవారుజామున కారులో బయలుదేరారు. ఒఆర్ఆర్‌పై శామీర్‌పేట దాటి కీసర వైపు వెళ్తున్న దారిలో వాహనాన్ని రోడ్డుకు ఒక వైపున ఆపి పడుకున్నట్టు అనుమానం వ్యక్తమవుతోంది. అయితే, ఉదయం 6 గంటల సమయంలో డయల్-100 ద్వారా శామీర్‌పేట పోలీసులకు ఒఆర్ఆర్‌పై ఒక కారు అగ్నికి ఆహుతవుతోందని సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా.. అప్పటికే కారు పూర్తిగా మంటల్లో కాలిపోతోంది. ఫైర్ ఇంజిన్ మంటలను ఆర్పేసింది. డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి పూర్తిగా సజీవ దహనమై.. మృతదేహం అస్థిపంజరంలా మారింది. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. ప్రాథమిక విచారణలో భాగంగా.. మంటల్లో కాలిపోయిన ఆ కారు ఫోర్డ్ ఎకోస్పోర్ట్, రిజిస్ట్రేషన్ నెం:టీఎస్03 ఎఫ్‌డీగా 7688గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు శామీర్‌పేట ఎస్‌హెచ్ఒ శ్రీనాథ్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో మాత్రమే స్పష్టమవుతాయని పోలీసులు చెప్పారు.